క్లుప్తంగా

అంకితభావంతో పనిచేయాలి



గన్నవరం: మండలంలోని కేసరపల్లి శివారు వీకేఆర్ కళాశాలలో నాలుగు దశాబ్దాలపాటు నాన్ టీచింగ్ స్టాఫ్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన గోళ్ల ఆరోగ్యస్వామికి సోమవారం సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాన్ టీచింగ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆరోగ్యస్వామిని దుశ్శాలువాలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం సంఘ నాయకుడు దేవరపల్లి ఏసుబాబు మాట్లాడుతూ.. ఉద్యోగ నిర్వహణలో అంకితభావంతో పనిచేసిన ఆరోగ్యస్వామి అందరికి ఆదర్శంగా నిలిచారని చెప్పారు. ఉద్యోగంతో పాటు అనేక నాటకాల్లో నటించడం, మిమిక్రీ కళాకారుడిగా గుర్తింపు పొందారని తెలిపారు. సీనియర్ ఉద్యోగి బాలశ్రీనివాస్, అధ్యాపకులు నవీన్, సిబ్బంది కారే ప్రసాద్, సంతోష్, అన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల సంఘం నాయకురాలు నాగలక్ష్మి మృతి

గన్నవరం రూరల్: ఆశావర్కర్ల సంఘం జిల్లా నాయకురాలు వై.నాగలక్ష్మి(55) సోమవారం గుండెపోటుతో మృతిచెందారు. మండలంలోని ముస్తాబాదకు చెందిన ఆమె సీపీఎం నాయకురాలిగా, ప్రజా సంఘాల్లో చురుకైన పాత్ర నిర్వహించారు. ఆశా వర్కర్ల హక్కుల కోసం జరిగిన అనేక పోరాటాల్లో పాల్గొన్నారు. ఆమె మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటు అని పలువురు సంతాపం వ్యక్తం చేశారు. నాగలక్ష్మి భౌతికకాయానికి ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి ఎస్ అనిల్‌కుమార్, కవి, ప్రజానాట్య మండలి రాష్ట్ర కమిటీ సభ్యుడు జీవీ రంగారెడ్డి, జిల్లా కార్యదర్శి షేక్ ఖాసీం నివాళులర్పించారు.

సంస్కార భారతి ఉగాది ఉత్సవాలు



పెనమలూరు: కృష్ణాజిల్లా సంస్కార భారతి ఆధ్వర్యంలో కానూరులో ఆదివారం ఉగాది ఉత్సవాలు నిర్వహించారు. గ్రామంలోని శ్రీవేణుగోపాలస్వామివారి ఆలయంలో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు కోలాటం, భరతనాట్యం, దేశభక్తి గీతాలు, అన్నమాచార్య కీర్తనలు, శ్రీ కృష్ణ లీల తరంగాలు, చిత్రలేఖన ప్రదర్శన నిర్వహించారు. అదే రోజు రాత్రి ఉత్తమ ప్రతిభ చాటిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. గ్రామ మాజీ సర్పంచి అన్నే సుజాత వేణుగోపాలకృష్ణమూర్తి, సంస్కార భారతి సభ్యురాలు సుహాసిని, విద్యార్థులు పాల్గొన్నారు.

గణపతికి కళారత్న హంస పురస్కారం



గన్నవరం రూరల్: మండలంలోని ముస్తాబాద జెడ్పీ హైస్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయుడుగా పని చేస్తున్న దామోదర గణపతిని రాష్ట్ర ప్రభుత్వం కళారత్న హంస పురస్కారంతో సత్కరించింది. ఆదివారం జరిగిన ఉగాది వేడుకల్లో సీఎం చంద్రబాబు నాయుడు చేతులమీదుగా గణపతి ఈ పురస్కారాన్ని అందుకున్నారు. అంతర్జాతీయ జానపద కళాకారుడిగా ఏపీ, తెలంగాణ ప్రజలకు ఈయన సుపరిచితుడు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మూడు సార్లు ప్రభుత్వం నాటక నంది అవార్డుతో ఆయనను సత్కరించింది. జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి, ముస్తాబాద సర్పంచ్ వేము రాధాకృష్ణ, హెచ్ఎం రామ్‌గోపాల్ సోమవారం గణపతికి అభినందనలు తెలిపారు.

ఎట్టకేలకు నూతన అర్చకుడి నియామకం

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ఎనికేపాడు గ్రామంలోని శ్రీ సీతారామస్వామి వారి దేవస్థానానికి నూతన అర్చకుడు ఎస్. మోహనా చారి నియమితులయ్యారు. సోమవారం ఆలయానికి వచ్చిన దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సృజన్, ఆలయ కార్యదర్శి పీ ప్రియాంక గత అర్చకుడు మారుతీరావు నుంచి ఆలయ తాళాలు, పలు రికార్డులను స్వాధీన పరుచుకున్నారు. కాగా గత ఆలయ అర్చకుడు అగ్నిహోత్రం మారుతీరావు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నాడని దేవదాయశాఖ ఉన్నతాధికారులు గత ఎనిమిది నెలల క్రితం సస్పెండ్ చేశారు. మారుతీరావుపై విచారణ పూర్తయ్యే వరకు తాత్కాలికంగా విధుల నుంచి తొలగించినట్లు తెలిపారు.

కక్షసాధింపు చర్యలే కారణం

కక్ష సాధింపు చర్యల్లో భాగంగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మారుతీరావును టీడీపీ నాయకులు సస్పెండ్ చేయించారని పలువురు ఆరోపిస్తున్నారు. గత 20 ఏళ్లుగా మారుతీరావు ఆలయ అర్చకుడిగా పని చేస్తున్నాడని గుర్తు చేస్తున్నారు. ఇటీవల విచారణకు హాజరైన దేవదాయశాఖాధికారుల వద్ద కూడా మారుతీరావునే అర్చకుడిగా కొనసాగించాలని పలువురు సూచించినా పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు.

ఆదమరిస్తే అంతే సంగతి

- రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- వంతెన నిర్మించాలని డిమాండ్



వికాస్ కాలేజీ రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న చప్టా

విజయవాడరూరల్: నున్న గ్రామంలోని జగనన్న కాలనీ, వికాస్ కాలేజీలకు వెళ్లే రోడ్డులో ఉన్న చప్టాపై ప్రయాణం ప్రమాదకరంగా ఉంది. వర్షాలు కురిసిన ప్రతిసారి రాకపోకలకు ఆటంకంగా మారింది. వాగులు పొంగి ప్రవహించే సందర్భంలో జగనన్న కాలనీలో నివాసం ఉంటున్న కుటుంబాలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. ఉప్పొంగే వాగుల ఉధృతి తగ్గే వరకు చప్టాపై ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణం చేయాల్సిన పరిస్థితి. దీంతో జగనన్న కాలనీవాసులతో పాటు వికాస్ విద్యాసంస్థల్లోని విద్యార్థులు, అధ్యాపకులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అదే మార్గంలో ఉన్న ఇండ్ల రామాసుబ్బారెడ్డి ఆసుపత్రికి వెళ్లే వారు కూడా ఇబ్బందులు పడుతున్నారు. గత ఏడాది సంభవించిన వరదలతో ఎక్కడ వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. ఆ సందర్భంలో ఒక మనిషి వాగులో కొట్టుకుపోయి ఎట్టకేలకు స్థానికుల సాయంతో బతికి బైటపడ్డాడు. అదే సందర్భంలో పశువులు వాగులో కొట్టుకుపోయాయి.

వంతెన నిర్మాణ చర్యలు నిల్


గత ఏడాది వాగులు పొంగుతున్న సందర్భంలో మండల తహసీల్దారు బీ సుగుణ, ఎంపీడీఓ, పోలీసు అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంలో గ్రామస్తులు చప్టాపై వంతెన నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. అధికారులు ఈ సమస్యపై వెంటనే రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వంతెన నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకొంటామని తెలిపారు. కాని ఇంతవరకు వంతెన నిర్మాణానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ప్రతిరోజూ వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఎంతో ప్రమాదకరంగా ఉన్న చప్టా వద్ద కనీసం వీధి దీపాలు కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో రాత్రి సమయాల్లో ప్రయాణం చేసే వారు పడిపోయిన సంఘటనలు అనేకం ఉన్నాయి. చప్టాపై వంతెన నిర్మాణానికి అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

చప్టాపై వంతెన నిర్మించాలి



ఈ రహదారిలో చప్టాపై వంతెన నిర్మించాలి. ఎప్పుడు వర్షం కురుస్తుందో వాగులు ఎప్పుడు ఉప్పొంగుతాయే తెలియని పరిస్థితి. జగనన్న కాలనీలో ఉండే ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలి. రైతులు కూడా పొలాలకు వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నారు.
– పోలారెడ్డి నాగిరెడ్డి, నున్న గ్రామం

ఇబ్బందులు పడుతున్నాం



జగనన్న కాలనీలో అనేక కుటుంబాలు ఇల్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నాయి. జగనన్న కాలనీకి వెళ్లాలంటే సరైన మార్గం లేక ఇబ్బంది పడుతున్నాం. అధికారులు స్పందించి చప్టాపై వంతెన నిర్మించాలి.
– వెంకటేశ్వరరావు, జగనన్న కాలనీ

జగనన్న కోసం ఏ త్యాగానికైనా సిద్ధం

వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త చక్రవర్తి



వణుకూరులో ఉపసర్పంచిగా గెలిచిన నాగరాజును అభినందిస్తున్న చక్రవర్తి

పెనమలూరు: జగనన్నను తిరిగి సీఎం చేయడానికి ఏ త్యాగానికైనా సిద్ధమేనని వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి అన్నారు. వణుకూరు గ్రామ పంచాయతీ ఉపసర్పంచి ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మద్దతుతో గెలిచిన ఆరేపల్లి నాగరాజును, వార్డు సభ్యులను ఆదివారం రాత్రి ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా చక్రవర్తి మాట్లాడుతూ వణుకూరు గ్రామ పంచాయతీ ఉపసర్పంచి ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి చెందిన వార్డు సభ్యులు ఎటువంటి ప్రలోభాలకు తలొగ్గక నాగరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారన్నారు. రానున్న కాలంలో ప్రజలు మరల వైఎస్సార్ సీపీకి పట్టంకట్టి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేస్తారని పేర్కొన్నారు. పార్టీ కోసం పని చేసిన ప్రతి ఒక్కరికి పూర్తి న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఉపసర్పంచిగా గెలిచిన నాగరాజును, వార్డు సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో కంకిపాడు జెడ్పీటీసీ సభ్యుడు బాకీబాబు, వైఎస్సార్ సీపీ పెనమలూరు మండల అధ్యక్షుడు కొత్తపల్లి వెంకటేశ్వరరావు, కంకిపాడు పార్టీ అధ్యక్షురాలు మాదు శ్రీహరిరాణి, గోసాల సర్పంచి సంగెపు శ్రీనివాసరావు, గ్రామ అధ్యక్షుడు చక్కా గోపీకృష్ణ, కార్యకర్తలు, గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఫ్యాప్టో నిరసనను జయప్రదం చేయాలి



సమావేశంలో పాల్గొన్న ఫ్యాప్టో నేతలు

గన్నవరం: ఫ్యాప్టో రాష్ట్ర సంఘం పిలుపు మేరకు పీఆర్సీ, ఐఆర్ బకాయిలు విడుదల చేయాలని కోరుతూ బుధవారం సాయంత్రం మూడు గంటలకు మచిలీపట్నంలోని ధర్నాచౌక్ వద్ద జరగనున్న నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘ నేతలు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాలలో ఫ్యాప్టో గన్నవరం శాఖ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మరీదు వరప్రసాద్, దేవరపల్లి విద్యాసాగర్ మాట్లాడుతూ.. న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం అందరూ కలిసి కట్టుగా ఉద్యమించాలని సూచించారు. నిరసన కార్యక్రమానికి ఉపాధ్యాయులు, ఫ్యాప్టో కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సంఘ నేతలు జీవీ రవిబాబు, జీ రాజబాబు, డీ శివప్రసాద్, బీ జ్ఞానానందం, పీ జగతి, డీ కృష్ణవేణి, ఎస్ సుజశ్రీ, పీ రాంగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లుపై నిరసన



హనుమాన్‌జంక్షన్‌లో నిరసన తెలుపుతున్న ముస్లింలు



యనమలకుదురులో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న ముస్లింలు

కంకిపాడు: వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ముస్లింలు సోమవారం నిరసన ప్రదర్శన చేశారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిని తప్పుపడుతూ నల్లరిబ్బన్లు ధరించి కంకిపాడు మసీదు నుంచి ఈద్గా మైదానం వరకూ ర్యాలీ నిర్వహించారు. వక్ఫ్ సవరణ బిల్లుతో వక్ఫ్ ఆస్తులను కాలరాసే కుట్ర జరుగుతోందని అన్నారు. పార్లమెంటులో బిల్లుకు ఆమోదం తెలిపితే సహించేది లేదని స్పష్టంచేశారు. వక్ఫ్ ఆస్తుల జోలికి రావొద్దని, సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ముస్లిం ఐక్యవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇమామ్‌సా తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్‌లో..

హనుమాన్‌జంక్షన్ రూరల్: కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లు ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకిస్తూ హనుమాన్‌జంక్షన్‌లో ముస్లింలు సోమవారం ఆందోళన నిర్వహించారు. స్థానిక ఏలూరురోడ్డులోని ఈద్గా వద్ద ముస్లింలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలోని భాగస్వామ్య పార్టీలు పార్లమెంట్‌లో వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకించాలని, లేనిపక్షంలో భవిష్యత్‌లో ముస్లింలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. సీపీఎం మండల మాజీ కార్యదర్శి అబ్దుల్ బారీ, ముస్లిం మత గురువు షఫీ కుర్రహ్మాన్ పాల్గొన్నారు.

పెనమలూరు: వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా యనమలకుదురులో ముస్లింలు ప్లకార్డులతో నిరసనలు తెలిపారు. రంజాన్ సందర్భంగా సోమవారం యనమలకుదురు జన్నతుల్ బక్కికబరస్తాన్ ఈద్గాలో జరిగిన నమాజ్‌లో ప్లకార్డులు ప్రదర్శించి నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ ఆస్తులు ఆక్రమించుకోవడానికి కుట్ర పన్నుతోందని ఆరోపించారు.

వెంకన్న ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



సుదర్శన యాగం చేస్తున్న అర్చకులు

కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీపద్మావతి అలివేలుమంగ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆయన శంకుస్థాపన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. తొలుత శ్రీభువనేశ్వరి పీఠాధిపతి కమలానందభారతిస్వామి పర్యవేక్షణలో వేదపండితులు గోపూజ, విఘ్నేశ్వరపూజ నిర్వహించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ పొట్లూరి బసవరావు, ఆలయ నిర్మాణ కమిటీ చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన చేశారు. గ్రామ సర్పంచ్ చేబ్రోలు లక్ష్మీమౌనిక, నీటి సంఘం అధ్యక్షుడు జాస్తి విజయభూషణ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యులు మరీదు లక్ష్మీదుర్గ, శొంఠి కిషోర్, ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు రాజులపాటి శ్రీనివాసరావు, కార్యదర్శి మరీదు రాంబాబు, కోశాధికారి పలగాని నాగమల్లేశ్వరరావు, వాస్తు సిద్ధాంతి వంశీ శర్మ, సాయినాథ్‌శర్మ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భారీ విరాళాలు

నూతనంగా నిర్మిస్తున్న ఆలయ నిర్మాణానికి దాతలు ఏఎంసీ మాజీ చైర్మన్ బసవరావు, విజయలక్ష్మి దంపతులు రూ. 10 లక్షలు, వారి కుటుంబ సభ్యులు జాస్తి సత్యనారాయణ, రజనీకుమారి దంపతులు, చింతల శ్రీదేవి, శ్రీనివాసరావు దంపతులు కలిసి రూ. 5 లక్షలు విరాళాన్ని ప్రకటించారు. అదేవిధంగా ఆలయ కమిటీలో ఉన్న 15 మంది సభ్యులు ఒక్కొక్కరు రూ. లక్ష చొప్పున రూ. 15 లక్షల విరాళాన్ని ఇచ్చారు.

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

పాయకాపురం(విజయవాడరూరల్): వాంబే కాలనీకి చెందిన బాలిక బట్టలషాపులో పనికి వెళుతున్నానని చెప్పి తిరిగి ఇంటికి రాలేదని వచ్చిన ఫిర్యాదు మేరకు నున్న పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. తొమ్మిదో తరగతి చదివిన బాలిక విజయవాడ రామాటాకీస్ వద్ద బట్టల షాపులో పనిచేస్తుంది. గత నెల 30వ తేదీన బట్టల షాపునకు వెళుతున్నానని చెప్పి ఇంటికి తిరిగి రాలేదు. ఇంటి వద్దనే ఉంటున్న కిషోర్ అనే వ్యక్తితో మాట్లాడుతుండేదని ఆయనపై అనుమానంగా ఉందని బాలిక నాయనమ్మ పితాని ఝాన్సీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రైతు నాయకుడు రంగారావు మృతి



పుషాడపు రంగారావు(ఫైల్)

హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమాన్‌జంక్షన్ పుర ప్రముఖుడు, రైతు నాయకుడు పూషడపు వెంకట నరసింహారావు(రంగారావు)(86) అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతిచెందారు. ఆయనకు ఇద్దరు కుమారులు, కుమార్తె. పుషాడపు రంగారావు రైతు సంఘాల్లో కీలకంగా పనిచేశారు. హనుమాన్ చెరుకు ఉత్పత్తిదారుల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడిగా, పాల సొసైటీ అధ్యక్షుడిగా విశేష సేవలు అందించారు. ఆయన భౌతికకాయానికి వైఎస్సార్ సీపీ సీనియర్ నేత డాక్టర్ దుట్టా రామచంద్రరావు, జనసేన పార్టీ గన్నవరం నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్ బాబు, కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, నాగార్జున సాగర్ ఎడమకాలువ ప్రాజెక్టు కమిటీ వైస్‌చైర్మన్ ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు, చెరుకు ఉత్పత్తిదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి నండూరు సత్య వెంకటేశ్వర శర్మ, హనుమాన్ షుగర్స్ మాజీ చైర్మన్ గుండపనేని ఉమావరప్రసాద్ నివాళులర్పించారు.

కళాకారుల సంక్షేమానికి కృషి చేయాలి

విజయవాడ కల్చరల్: సాంస్కృతిక కళా సంస్థలు కళాకారుల సంక్షేమానికి కృషి చేయాలని మహానటి సావిత్రి కళాపీఠం వ్యవస్థాపకురాలు పరుచూరి విజయలక్ష్మి తెలిపారు. సావిత్రి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికపై సోమవారం సాంస్కృతిక, కళారంగాలకు చెందిన వారికి సత్కార కార్యక్రమం నిర్వహించారు. విజయలక్ష్మి మాట్లాడుతూ కళాకారులు సాంస్కృతిక వారధులని చెప్పారు. ఉగాది పురస్కారాల్లో సాంస్కృతిక, కళారంగాలు, గాయనీ గాయకుల విభాగాన్ని చేర్చి వారికి కూడా పురస్కారాలు ఇవ్వాలని సూచించారు. జ్యోతిష్య శాస్త్ర వేత్త ప్రసూనా రామన్ కళాపీఠం చేస్తున్న కృషిని అభినందించారు. చింతకాయల చిట్టిబాబు, గుడిపాటి హరికృష్ణ, శ్యాంప్రసాద్, టీవీ వీరభద్రరావు డేవిడ్‌రాజు, సత్యవర్ధన్, ఆదిరాల జయప్రభ, కొమ్మినేని రత్నకుమారి, వడ్డాది కామేశ్వరి, తబలా చిట్టిబాబు, కొప్పుల అశోక్, చావా నరసింహారావు, కారుమంచి రాజు, అమూలారాణిలను సత్కరించారు.

భక్తిశ్రద్ధలతో ఈద్-ఉల్-ఫితర్



కంకిపాడు ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనల్లో ముస్లింలు

గన్నవరం: ఈద్-ఉల్-ఫితర్ (రంజాన్) పర్వదిన వేడుకలను గన్నవరం ప్రాంతంలోని ముస్లింలు సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. నెల రోజుల పాటు చేసిన కఠిన ఉపవాస దీక్షలకు ముగింపు పలికారు. కేసరపల్లి శివారు దుర్గాపురంలోని ఈద్గా వద్ద గన్నవరం అంజుమన్ కమిటీ ఆధ్వర్యంలో సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. మత పెద్దలు రంజాన్ పండుగ సందేశాన్ని వివరించారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. దావాజీగూడెంలోని పామర్తినగర్‌లో మసీదు కమిటీ ఆధ్వర్యంలో రంజాన్ ప్రార్థనలు జరిపారు. తొలుత మసీదు నుంచి ఈద్గా వరకు ప్రదర్శనగా ముస్లింలు తరలివచ్చారు.

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం పలు గ్రామాల్లో సోమవారం రంజాన్ వేడుకలు నిర్వహించారు. రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి గ్రామాల్లోని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఎనికేపాడులోని మజ్జిద్ ఈ మహ్మదీయ మసీదులో ముస్లింలు ప్రార్థనలు చేశారు. మత పెద్ద మౌలానా ఫరీద్ సాహెబ్ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వైస్ ప్రెసిడెంట్ షేక్ ఖాలేషావలి సాహెబ్, సెక్రటరీ సయ్యద్ రఫీద్ సాహెబ్, సయ్యద్ మస్తాన్, సుభానీ, ఖాదర్ బాషాలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

పెనమలూరులో..

పెనమలూరు: మండల పరిధిలో రంజాన్ పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో చేశారు. యనమలకుదురులో జన్నతుల్ బక్కి ఖబరస్తాన్, ఈద్గా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఇమామ్ మౌలానా సిద్ధాక్ సాహెబ్ ఈద్ ముబారక్ తెలిపారు. కాగా వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో పవిత్ర రంజాన్ నమాజ్‌కు భక్తులకు ఏర్పాట్లు చేశారు. కానూరు సనత్‌నగర్‌లో రంజాన్‌ను పవిత్రంగా చేసుకున్నారు. స్థానిక మసీదుల్లో ప్రార్థనలు చేశారు. వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి ముస్లిం సోదరులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన 15 వేల స్వీట్ బాక్స్‌లను ముస్లింలకు అందజేశారు. అలాగే తాడిగడప మజీత్ ఈ మొహమ్మదియాలో నూతనంగా ఏర్పాటు చేసిన కమిటీ ఆధ్వర్యంలో రంజాన్‌ను చేశారు. గంగూరు గ్రామంలో పండుగ సందర్భంగా ముస్లింలు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

కంకిపాడు: రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు సోమవారం భక్తిశ్రద్ధలతో చేసుకొన్నారు. కంకిపాడు, గోసాల, ఈడుపుగల్లు, నెప్పల్లి, కోలవెన్ను తదితర గ్రామాల్లోని మసీదుల పరిధిలోని ముస్లింలు కంకిపాడు ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనల్లో చేశారు. కంకిపాడు మత గురువు మహమ్మద్ ఉస్మాన్, గోసాల ప్రభుత్వ ఖాళీ మహమ్మద్ ఆరీఫ్, కంకిపాడు, గోసాల మసీదు కమిటీల అధ్యక్షులు కాలేషా, షేక్ సుబాని, కార్యదర్శి కరిముల్లా, ఉమర్ అలీ, కలీల్ రెహమాన్, బాజీ, మెహబూబ్ భాషా, షేక్ మస్తాన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. తెంపల్లి, వీరపనేనిగూడెం, చిక్కవరం, గొల్లనపల్లి, సూరంపల్లి గ్రామాల్లో రంజాన్ వేడుకలను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు.

ఉయ్యూరు: రంజాన్ పర్వదినాన్ని ఉయ్యూరులో సోమవారం ఘనంగా జరుపుకొన్నారు. ఈద్గా మైదానంలో అల్లాహను ప్రార్థిస్తూ ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు ఈద్ ముబారక్ అంటూ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. పట్టణంలోని అన్ని ప్రార్థనా మందిరాల్లో ప్రార్థనలు చేశారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలంలో రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు ఘనంగా జరుపుకొన్నారు. హనుమాన్‌జంక్షన్ ఏలూరురోడ్డులోని ఈద్గా వద్ద జరిగిన ప్రత్యేక ప్రార్థనకు అధికసంఖ్యలో ముస్లింలు తరలివచ్చారు. ముస్లిం మత గురువు షఫీ కుర్రహ్మాన్ ప్రత్యేక సందేశాన్ని అందించారు. జమాతే ఇస్లామీ హింద్ మసీదు, మహాత్మాగాంధీ నగర్, వేలేరు, కొత్తపల్లి, కొత్త మల్లవల్లి, శోభనాద్రిపురం గ్రామాల్లోని మసీదుల్లో ప్రార్థనలు నిర్వహించారు.



కానూరు సనత్‌నగర్‌లో ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలుపుతున్న చక్రవర్తి

ప్రార్థనలను పర్యవేక్షించారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఈద్గా వద్ద ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేశారు.

ముస్తాబాదలో..

గన్నవరం రూరల్: క్రమశిక్షణ, ధార్మిక చింతనల కలయిక రంజాన్ అని ముస్తాబాద జామియా మసీద్ ఇమాం ఇక్బాల్ భక్తులకు సందేశమిచ్చారు. స్థానిక హైస్కూల్ వద్ద ఈద్గాలో రంజాన్ ప్రార్థనలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన రంజాన్ సందేశమిచ్చారు. మసీద్ కమిటీ అధ్యక్షుడు షేక్ హుస్సేన్,

ఆనందోత్సాహాలతో రంజాన్



పి.నైనవరంలో ప్రార్థన చేస్తున్న ముస్లిం సోదరులు

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండలం నున్న, పి.నైనవరం, అంబాపురం గ్రామాల్లో ముస్లింలు సోమవారం రంజాన్ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకొన్నారు. పి.నైనవరం గ్రామంలోని గోలీలదొడ్డిలో జరిగిన ప్రార్థనలో మత గురువు ఎండీ సాహిద్ మాట్లాడుతూ పవిత్ర రంజాన్‌ను శాంతి, ఐకమత్యంతో జరుపుకోవాలని సూచించారు. అల్లా దీవెనలు అందరికి ఉండాలని ఆకాంక్షించారు. నున్న గ్రామంలోని ఈద్గాలో ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకొంటూ ఆనందాన్ని పంచుకున్నారు. మసీదు వ్యవస్థాపక అధ్యక్షుడు ఖాదర్‌వలీ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. టీచర్స్ కాలనీ, అంబాపురం గ్రామంలో రంజాన్‌ను భక్తిశ్రద్ధలతో చేసుకొన్నారు.



ఉయ్యూరులోని ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు



ఎనికేపాడులో మత పెద్దలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ముస్లింలు



ముస్తాబాదలో రంజాన్ ప్రార్థనల్లో ముస్లింలు

ఇద్దరు వ్యక్తులపై దాడి

పెనమలూరు: గంగూరులో ఇద్దరు వ్యక్తులపై దాడి చేసిన ఘటనపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసుల కథనం మేరకు.. గంగూరు సెంటర్‌లో కోసూరి తిరుపతిరావు లారీ డ్రైవర్‌గా పని చేస్తాడు. లారీ ఆఫీసు వద్ద పోరంకికి చెందిన ప్రశాంత్ అనే వ్యక్తి తన లారీని కూడా పార్కు చేస్తాడు. కాగా ప్రశాంత్ సోదరుడు లారీ ఆఫీసుకు వచ్చి తమ లారీలో బ్యాటరీలు చోరీ జరుగుతున్నాయని తిరుపతిరావును అడిగాడు. దీనికి తిరుపతిరావు మా లారీలో బ్యాటరీలు పోవడం లేదు, వెళ్లి మీ అన్న ప్రశాంత్‌ను అడగమన్నాడు. దీంతో ప్రశాంత్, అతని సోదరుడు క్రికెట్ బ్యాట్‌తో తిరుపతిరావు, అక్కడే లారీ ఆఫీసులో ఉన్న సీతారామయ్యపై దాడి చేశారు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

క్రైస్తవ పుణ్యక్షేత్రాల సందర్శన

గన్నవరం: మండలంలోని కేసరపల్లిలో ఉన్న పునీత అంథోని దేవాలయం నుంచి 250 మంది భక్తులు గుంటూరు జిల్లాలోని పుణ్యక్షేత్రాలు, దేవాలయాల సందర్శనకు సోమవారం వెళ్లారు. గుంటూరు జిల్లాలోని యడ్లపాడులో మాత పుణ్యక్షేత్రం, నరసరావుపేటలోని బాలయేసు దేవాలయం, ఫిరంగిపురంలోని బాలయేసు పుణ్యక్షేత్రం, నగరపాలెంలోని పునీత అంథోని పుణ్యక్షేత్రాలను భక్తులు సందర్శించినట్లు ఫాదర్ కిషోర్ తెలిపారు. ఈ సందర్భంగా నరసరావుపేట చర్చిలో విచారణకర్త ఫాదర్ జోజయ్యతో కలిసి దివ్యబలిపూజ సమర్పించినట్లు తెలిపారు.